



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 154 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల ఆదివారం 8 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE 154 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SUN 8 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

# ఇది చారిత్రక ఘట్టం

- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన
- ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య
- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా
- హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన
- ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి



"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని

- మిగతా 2లో



## వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు...

# జగన్ కు ఏంటి బాధ?

- తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందన్న శ్రీనివాసవర్మ
- కల్తీ జరిగిందని వైవీ, భూమన, చెవిరెడ్డి ఇప్పుకున్నారని వ్యాఖ్య
- స్వామివారికి హారతి ఇచ్చే నెయ్యిని కల్తీ చేశారని మండిపాటు

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ నివేదిక ప్రకారం నిబంధనల ఉల్లంఘన జరిగిందని చెప్పారు. లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని అన్నారు. కానీ, ఈ వ్యవహారంలో వైసీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదంగా

- మిగతా 2లో



## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...

### కదిలిపోయిన పవన్ కల్యాణ్

- బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో
- వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు
- ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర

"పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు

- మిగతా 2లో




## ఎడిటర్ వ్యూ

# అంగరంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకే గిరిశృంగం ద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైన ఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు దుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి.ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 8తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆంధప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్ర మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 15వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది.

# శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు... సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు నేడు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం అందించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు,

భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సీఎం చంద్రబాబును ఆహ్వానించారు.

## వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ?

- మొదటి పేజి తరువాయి
ఉన్నాయని విమర్శించారు. కల్తీ నెయ్యి విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముగ్గురూ కల్తీ జరిగిందని ఒప్పుకున్నారని శ్రీనివాసవర్మ అన్నారు. కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ అని ప్రశ్నించారు. బోలేబాబాకు పాల ఉత్పత్తి, డెయిరీ లేకపోయినా నెయ్యి తయారు చేశారని వివరించారు. టెండర్ల నిబంధనల్లో పెద్ద ఎత్తున మార్పులు చేశారని... అవినీతి కోసం అలా చేశారని అన్నారు. ఆ నెయ్యితోనే స్వామివారికి హారతి ఇస్తామని... అలాంటి నెయ్యిని కల్తీ చేశారని మండిపడ్డారు. అర్హత లేని వారికి నెయ్యి కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారుశ.

## భారత వ్యాక్సిన్లు రాకపోవడం మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ నుంచి అందుబాటు ధరల్లో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడం పాకిస్థాన్‌కు ఆర్థికంగా భారంగా మారిందని ఆ దేశ ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ వెల్లడించారు. భారత వ్యాక్సిన్లు గత ఏడాది నుంచి రావడం లేదని అన్నారు. వీటి దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందన్నారు.

ప్రస్తుతం ప్రతి సంవత్సరం 400 మిలియన్ డాలర్లతో వ్యాక్సిన్లను దిగుమతి చేసుకుంటున్నామని, వీటిలో 49 శాతం ఖర్చులను 'గావీ' (గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్) ద్వారా పని చేసే అంతర్జాతీయ సంస్థలు, మిగతా 51 శాతం ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. స్థానికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించకపోతే 2031 నాటికి దిగుమతి కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి వ్యాక్సిన్ల సరఫరాకు అంతర్జాతీయ సహకారం ముగిసిపోతుందని అన్నారు.అత్యంత పేద దేశాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందించడానికి 'గావీ' పనిచేస్తుంది. 'గావీ' సాయంతో పాకిస్థాన్ అత్యంత చౌకగా టీకాలను సేకరించేది. వీటిలో ఎక్కువగా భారత్ నుంచే వస్తాయని, అవి అందుబాటు ధరల్లో ఉంటాయని పాకిస్థాన్ మంత్రి వెల్లడించారు. కరోనా సమయంలో లక్షలాది కొవిడ్ వ్యాక్సిన్లను భారత్ నుంచి సేకరించడానికి 'గావీ' సహాయం చేసిందని అన్నారు.పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం పౌరులకు 13 రకాల వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తోంది. అయితే ఏ వ్యాక్సిన్‌ను కూడా స్థానికంగా ఉత్పత్తి చేయడం లేదు. 24 కోట్ల జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఐదో దేశంగా పాకిస్థాన్ ఉంది. ప్రతి సంవత్సరం 62 లక్షల జననాలు నమోదవుతుండటంతో వ్యాక్సిన్లకు డిమాండ్ పెరిగింది.

## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు... కదిలిపోయిన పవన్ కల్యాణ్

చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జులవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జులవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి.ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 'పల్లెపండగ 1.0, 2.0', సాస్కీ నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జులవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేయడం గమనార్హం.

## పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించొద్దు

బడ్జెట్ లో ఏపీకి పెద్ద పీట వేశారని... రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు రూ. 10,134 కోట్లు, అమరావతి కోసం రూ. 1,120 కోట్లు కేంద్ర బడ్జెట్ లో కేటాయించారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్రం సాయంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను సాధించిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తోందని తెలిపారు. రాష్ట్రానికి బలమైన పునాదులు పడుతున్నాయని... పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించవద్దని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఎన్నో విజయాలను సాధిస్తోందని రామ్మోహన్ నాయుడు కొనియాడారు. వికసిత్ భారత్ దిశగా దేశం దూసుకుపోతోందని అన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి, దేశ శ్రేయస్సే లక్ష్యంగా మోదీ ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశ ప్రజల భవిష్యత్తును నిర్దేశించే విధంగా, యువత ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. రాబోయే 20 ఏళ్ల పాటు 7 శాతం వృద్ధి రేటు కొనసాగేలా నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను రూపొందించారని కితాబునిచ్చారు.

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం.. ఇది చారిత్రక ఘట్టం

- మొదటి పేజి తరువాయి
వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం"

అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు.

అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే

- మొదటి పేజి తరువాయి
ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు.వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయిన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు" అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. "ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా?" అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు.

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు. "ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు? మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడులు..

బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ సంస్థ 'స్పేస్‌ఎక్స్' వ్యవహారంపై సమీక్ష జరపాలని ఇద్దరు అమెరికన్ డెమొక్రటిక్ సెనేటర్లు డిమాండ్ చేశారు. ఈ సంస్థలో చైనాకు చెందిన పెట్టుబడిదారులు రహస్యంగా వాటాలు కొనుగోలు చేశారని, ఇది అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రక్షణ శాఖ (ఋణ) కార్యదర్శి పీట్ హెగ్సెత్‌కు వారు లేఖ రాశారు. మసాచుసెట్స్ సెనేటర్ ఎలిజబెత్ వారెన్, న్యూజెర్సీ సెనేటర్ ఆండీ కిమ్.. రక్షణ శాఖకు రాసిన లేఖలో ఈ ఆందోళనలను ప్రస్తావించారు. స్పేస్‌ఎక్స్ రక్షణ శాఖకు ఒక ప్రధాన కాంట్రాక్టర్‌గా ఉందని గుర్తుచేశారు. ఇటీవల బయటపడిన కోర్టు రికార్డులు, మార్చిలో వచ్చిన ఒక ప్రోపబ్లికా పరిశోధనాత్మక కథనాన్ని వారు తమ లేఖలో ఉటంకించారు. ఆఫ్‌షోర్ ఖాతాల ద్వారా స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడిదారులకు వాటాలు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని ఈ నివేదికలు ఆరోపిస్తున్నాయి."వ్యూహాత్మక రంగాల్లో ప్రత్యర్థి దేశాల నుంచి వచ్చే విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇది విరుద్ధం. కీలకమైన సైనిక, నిఘా, పౌర మౌలిక సదుపాయాలను ఇది ప్రమాదంలో పడేస్తుంది" అని సెనేటర్లు పేర్కొన్నారు. రక్షణ శాఖతో స్పేస్‌ఎక్స్‌కు 5.9 బిలియన్ డాలర్ల లాంచ్ సర్వీస్ కాంట్రాక్టుతో సహా బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందాలున్నాయి.

"మన జాతీయ భద్రతా వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న స్పేస్‌ఎక్స్ లాంటి సంస్థపై చైనా వంటి ప్రత్యర్థి దేశం పెత్తనం చెలాయించగలిగే అవకాశం ఉండడం ప్రమాదకరం" అని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని చైనా పెట్టుబడిదారులు తెలుసుకుని, అమెరికా జాతీయ భద్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందని సెనేటర్లు హెచ్చరించారు. స్పేస్‌ఎక్స్‌లో చైనా ప్రభావంపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు, ఈ భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరించడానికి డీఓడీ ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో ఫిబ్రవరి 18లోగా తెలియజేయాలని వారు తమ లేఖలో కోరారు.

## 'అరెస్ట్' ఎప్పుడు చేయాలంటే.. పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు


- మొదటి పేజి తరువాయి
ఈ మేరకు సతేందర్ కుమార్ అంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కే సింగ్ ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది.

### సుప్రీం బెంచ్ సూచనలు ఇవే..

క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా?.. బీఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చెయ్యవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 (వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు) ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని; నిందితుడు, సహ నిందితుడనే భేదాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులనూ సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బీఎన్ఎస్ సెక్షన్ 35(1)(బి) ప్రకారం.. ఎలాంటి వారెంట్ లేకున్నా పోలీసులు అరెస్టు చేయవచ్చునే నిబంధనను ప్రస్తావిస్తూ.. ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

## నూతన దంపతులను అశ్శీర్వదించిన ఎమ్మెల్యే ఆనందబాబు.

వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్ ఫిబ్రవరి, 7:నూతన వధూవరులుగా ఏకమైన దంపతులు ఇరువురి జీవితం సుఖసంతోషాలతో సాగాలని వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు ఆశీర్వదించారు.శనివారంవేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వాగోలు వసంత రావు కుమారుని వివాహ వేడుక కు ఎమ్మెల్యే ఆనందబాబు హాజరయ్యారు. వధూవరుల స్వగృహంలో ఘనంగా నిర్వహించబడిన ఈ శుభకార్యానికి మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు ఆనంద బాబు హాజరై,నూతన వధూ వరులను ఆశీర్వదించి,వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

## అమరావతి క్వాంటం వ్యాలీతో ఏపీలో సరికొత్త సాంకేతిక విప్లవం..

### - ఎమ్మెల్యే గళ్లా మాధవి..



బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07,
ఆంధ్రప్రదేశ్ లో క్వాంటం టెక్నాలజీ రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా తుళ్లూరు ఉద్దండరాయునిపాలెంలో క్వాంటం వ్యాలీ భవనానికి శంకుస్థాపన జరగడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు చారిత్రాత్మక ఘట్టమని, క్వాంటం వ్యాలీకి రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించి, దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గళ్లా మాధవి వెల్లడించారు. ఆగస్టు నాటికి క్వాంటం వ్యాలీ భవనం నిర్మాణం పూర్తి చేసి, డిసెంబరు నాటికి క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని, క్వాంటం వ్యాలీ రాష్ట్రానికి "క్వాంటం నెర్వ్ సెంటర్"గా మారనుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్స్, క్వాంటం సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో అత్యున్నత స్థాయి పరిశోధనలు ఇక్కడ జరగనున్నాయని, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్ కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో ఈ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు.ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రముఖ సంస్థలు క్వాంటం వ్యాలీలో భాగస్వాములు కావడం అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెస్తుందని, భారత్‌లో మొదటి క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ అమరావతిలో ఏర్పడటం రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను కల్పిస్తుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు.గతంలో ఐటీ విప్లవం లక్షలాది ఉద్యోగాలు సృష్టించినట్లే, క్వాంటం టెక్నాలజీ కూడా భవిష్యత్తులో యువతకు అపార ఉపాధి అవకాశాలు కల్పించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆవిష్కరణల కేంద్రంగా అమరావతి ఎదుగుతోందని, కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాంటం మిషన్‌కు రూ.6 వేల కోట్లు కేటాయించి, ఈ రంగాన్ని ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. అమరావతి క్వాంటం వ్యాలీ దేశ క్వాంటం మిషన్‌కు పునాదిరాయిగా నిలుస్తుందని, భవిష్యత్తులో అమరావతి సైన్స్, కంప్యూటేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి ధీమా వ్యక్తం చేశారు.క్వాంటం కంప్యూటింగ్ వైద్యరంగం, కమ్యూనికేషన్ రంగాల్లో పెనుమార్పులు తీసుకురానుందని, ఈ ఆవిష్కరణల ప్రభావం రాబోయే రోజుల్లో మరింత స్పష్టంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు

## విద్య,సామాజిక, ఆర్థిక, డిజిటల్ నైపుణ్యాలపై అవగాహన కల్పించాలి

### -: ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

గూడ్లూరు, పెన్ పవర్) పిబ్రవరి 07:




మండల కేంద్రమైన గూడ్లూరులో సినిమా హాల్ సెంటర్లో ఏర్పాటు చేసిన అక్షరాంధ్ర కేంద్రాన్ని గుడ్లూరు ఎంపీడీవో వై. వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు.నిరక్షరాస్యులుగా గుర్తించిన వారితో సాన్నిహితంగా కూర్చుని, చదువు ప్రయోజనాలు, జీవన శైలిలో మార్పు గురించి క్షుణ్ణంగా వివరించారు. మూడు రోజులుగా అక్షరాంధ్ర కేంద్రంలో ఏమేమీ నేర్పించారో అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ యుగంలో అండ్రాయిడ్ ఫోన్లు, కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఉచిత బస్సు ప్రయాణ సౌలభ్యం (మహిళలకు) గురించి చెప్పారు. బస్సుల్లో గ్రామ పేర్లు తామే గుర్తించుకోవాలని, ఇతరులపై ఆధారపడకుండా అక్షరాలను గుర్తించే విధంగా స్వావలంబన పొందాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో వాలంటరీ టీచర్స్ చిమ్మిరి శ్రీదేవి, దామా మాధురి, జ్యోతి పాల్గొన్నారు



## కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి చర్చ...

### -వెలగలేటి గంగాధర్..

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07
బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు నేతృత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల మొక్కను అందించిన మిర్చియార్డ్ డైరెక్టర్ కూతురు శ్రావణ కుమారి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో కూటమి పార్టీలు మరింత సమన్వయంతో కలసి పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు జిల్లా కార్యదర్శి సురేష్ జైన్ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాంబశివరావు జితేంద్ర గుప్తా మైలవరపు ప్రవీణ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

### - కమిషనర్ కె.మయూర్ అశోక్...



బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07.
అంకిరెడ్డిపాలెంలోని జి.ఇమాన్యుయేల్ తన ఖాళీ స్థలానికి సంబంధించి రూ.7 లక్షలు పన్ను చెల్లించడంపై నగర కమిషనర్ తమ చాంబర్ లో అభినందించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో పన్నులు ఎంతో కీలకమని, నగరపాలక సంస్థకు బకాయిఉన్న ప్రతి ఒక్కరూ చెల్లించాలన్నారు. ఇప్పటికే వార్డ్ ల వారీగా డిమాండ్ నోటీసులు, స్లిప్స్ పంపిణీకి అడ్మిన్ కార్యదర్శులకు అందించామన్నారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా క్యాష్ కౌంటర్లను కూడా ఉదయం 8 నుండి రాత్రి 7 గంటల వరకు పనిచేసేలా సిబ్బందిని కేటాయించామన్నారు. కనుక ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీలు సకాలంలో చెల్లించాలని కోరారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవెన్యూ అధికారి రెహ్మాన్, ఇన్స్పెక్టర్ వినాయకరావు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే నసీర్ సీఎం రిలీఫ్ ఫండ్ రిలీజ్ చేశారు...



బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07.
ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేలాది మందికి కార్పొరేట్ హాస్పటల్ దిటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల ట్రీట్మెంట్ల ఏర్పాటు చేయడం జరిగినది. పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయని నిధి నుంచి ఆంధ్రప్రదేశ్ లో దాదాపుగా 4000 కోట్ల రూపాయలు ఇవ్వటం జరిగినది. అందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి తొమ్మిది కోట్ల రూపాయలు ఇప్పటివరకు ఇవ్వడం జరిగినది.కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలంలో తూర్పు నియోజకవర్గం లో పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి రియంబర్స్మెంట్ అందించటం జరిగింది.గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక సదుపాయాలు ఏర్పరచుకోవడానికి 19 వేల కోట్ల రూపాయలు వెచ్చించటం జరిగినది. దీనివలన మారుమూల ప్రాంతాలు నుంచి కూడా ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ప్రభుత్వం ఏర్పర్చినటు వంటి అత్యాధునిక సదుపాయాలు ఉపయోగించుకోవడం జరుగుతుంది.

## "స్వచ్ఛ ఆంధ్ర"లో భాగస్వాములు కండి"

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఇన్చార్జి కలెక్టర్ - జాయింట్ కలెక్టర్ యం. నవీన్



మచిలీపట్నం (పెన్ పవర్) పిబ్రవరి 07:
మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణములోని అన్ని కార్యాలయాల సిబ్బంది అందరూ వివిధ పనుల నిమిత్తం వచ్చే అర్జీదారులు ప్రతి శనివారం సైకిల్" లేదా "కాలి నడకన" కార్యాలయమునకు హాజరు కావాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి ఆదేశాల ప్రకారం
వాయు కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛ మైన గాలి కోసం కృషి చేసే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన కావలి ఎమ్మెల్యే

కావలి, పెన్ పవర్) పిబ్రవరి 07:
కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం 30వ విడత ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఇప్పటివరకు కావలి నియోజకవర్గ ప్రజలకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. 40 మంది లబ్ధిదారులకు సంబందించిన రూ.27,97,602 చెక్కులను శనివారం అందజేశారు. ఇప్పటివరకు మొత్తం 1319 మంది దరఖాస్తు చేసుకోగా 962 మందికి 7,70,36,586. మరో 357 మంది లబ్దిదారులు దరఖాస్తులు ప్రాసెస్ లో ఉన్నవని, వెరిఫికేషన్ అనంతరం వీరికి కూడా త్వరలో చెక్కులు అందజేయబడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులు అభివృద్ధి కార్యక్రమాలకు కాకుండా, పూర్తిగా వ్యక్తిగతంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయించుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగపడేలా అందించామని ఎమ్మెల్యే వివరించారు. ఆర్థిక స్థోమత లేక అప్పులు చేసి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్యమంత్రి చేపట్టిన ఈ సహాయ కార్యక్రమం ఎంతో ఊరటనిచ్చిందన్నారు. పేదవారికి సహాయం చేసే అవకాశం తనకు కల్పించిన కావలి నియోజకవర్గ ప్రజానికానికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున సహాయం అందేలా తనవంతు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.



# పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటూ నాగరాజు అందరిలో స్ఫూర్తినింపారు

### -గ్రూప్-2 విజేత నందం నాగరాజుకు వైసిపి నేతలు ఘన సన్మానం

### -ఫోన్లో అభినందనలు తెలిపిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్యాన్సర్ వైద్య నిపుణులు సింహాద్రి చంద్రశేఖరరావు

చల్లపల్లి పెన్ పవర్ డిసెంబర్ 7

అన్ని సక్రమంగా ఉన్నా.. ప్రభుత్వ ఉద్యోగం సాధించటం కష్టతరంగా మారిన ఈ రోజుల్లో ప్రమాదంలో కంటి చూపును కోల్పోయినప్పటికీ పట్టుదలతో కృషిచేసి గ్రూప్ 2 విజేతగా నిలిచిన నందం నాగరాజు అందరిలో స్ఫూర్తినింపారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చల్లపల్లి మండల యూత్ నాయకులు వెనిగళ్ళ తారక జగదీష్ అన్నారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ శివారు సాలిపేటకు చెందిన లేటు నందం మోహన్ రావు, వెంకటేశ్వరమ్మల కుమారుడు నందం నాగరాజు తాజాగా విడుదలైన గ్రూప్ 2 ఫలితాలలో విజయం సాధించారు. ఏపీపీఎస్సీ హెచ్వోడిలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగాన్ని సంపాదించారు. ప్రమాదంలో కంటి చూపు కోల్పోయినప్పటికీ పట్టు వదలకుండా చదివి ఉద్యోగం సాధించిన నాగరాజుకు అన్ని వర్గాల నుంచి అభినందనలు వెలివెత్తుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల యూత్ నాయకులు వెనిగళ్ళ తారక జగదీష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జుజ్జువరపు భాగ్యారావు , జంగాల శ్రీనివాసరావు, సూదాని సుబ్రహ్మణ్యం, స్నేహితులు వంకాయల సురేష్, షేక్ నాగుల్ మీరాలు శనివారం నందం నాగరాజు ఇంటికి వెళ్లి అభినందించారు. పూలమాలు వేసి, శాలువా కప్పి, స్వీట్లు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ



సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ నాగరాజు విజయం ఇక్కడితో ఆగిపోకుండా అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు సింహాద్రి చంద్రశేఖరరావు ఫోన్లో నాగరాజుతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. తప్పకుండా వచ్చి కలుస్తానని నాగరాజుతో చెప్పారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనను అభినందించిన, అభినందించడానికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు

# క్వాంటమ్ టెక్నాలజీలో దేశానికి దిశానిర్దేశం చేసే కేంద్రంగా అమరావతి.- పెమ్మసాని..

పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07,

అమరావతి నిర్మాణం కేవలం భవనాలతో కాకుండా భవిష్యత్తు సాంకేతికతలతో రూపుదిద్దుకుంటోందని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై భారీ పోటీ నెలకొని, రాబోయే దశాబ్దాల్లో ఇది వందల బిలియన్ డాలర్ల ఆర్థిక విలువ సృష్టించే రంగమని చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం శాస్త్రసాంకేతిక రంగాల్లో వేగంగా ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు.నేషనల్ క్వాంటమ్ మిషన్ కింద రూ.6,000 కోట్ల పెట్టుబడులు, స్టార్టప్ వ్యవస్థ విస్తరణ, సాంకేతిక విద్యా సంస్థల పెరుగుదల దేశ బలాన్ని చూపుతున్నాయని తెలిపారు.

క్వాంటమ్ రంగంలో భారతదేశానికి ఉన్న అతిపెద్ద బలం యువతేనని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రతిభను తీర్చిదిద్దే సామర్థ్యం మన దేశానికి ఉందన్నారు.

క్వాంటమ్ మెకానిక్స్‌ను తిరిగి కనిపెట్టాల్సిన అవసరం లేదని, అప్లికేషన్లు, అల్గారిథమ్ లు, దేశానికి ఉపయోగపడే పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ రంగంలో ముందంజలో నిలబెట్టే దిశగా అమరావతిలో తీసుకుంటున్న చర్యలు చారిత్రాత్మకమని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ వల్లే హైటెక్ సిటీ, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు సాధ్యమయ్యాయని, అదే దిశలో ఇప్పుడు క్వాంటమ్ హబ్‌గా అమరావతి ఎదుగుతోందన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశంలో తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ వేదికను



ఏర్పాటు చేసి, ఔషధ పరిశోధన, బ్యాటరీ టెక్నాలజీ, సరఫరా వ్యవస్థలు, ఆర్థిక రంగం వంటి కీలక రంగాల్లో వినియోగాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.క్వాంటమ్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, క్రయోజెనిక్స్, ఎర్రర్ కరెక్షన్ వంటి రంగాల్లో దేశానికి అవసరమైన నైపుణ్యాలను తయారు చేసే టాలెంట్ పైప్‌లైన్‌ను నిర్మించనున్నామని చెప్పారు.

క్వాంటమ్ టెక్నాలజీ ఇప్పుడు ఎంపిక కాదు, జాతీయ భద్రత మరియు ఆర్థికాభివృద్ధి కోసం తప్పనిసరి అవసరమని స్పష్టం చేశారు.యువత ఈ సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుని, ఉన్నది చదవడమే కాకుండా నూతన ఆవిష్కరణలను సృష్టించే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అమరావతి భవిష్యత్తులో క్వాంటమ్ విప్లవానికి కేంద్రంగా నిలిచి, దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే నగరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ పి ఎ ఆర్ డి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ..

బపెన్ పవర్ గుంటూరు, 07 ఫిబ్రవరి, వెంకటపాటి విద్యా దీవెన ద్వారా ప్రతి సంవత్సరం సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ మరియు ఇతర పోటీ పరీక్షలకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించబడుతోంది.

ఈ కార్యక్రమంలో విద్యా బోధన (కోచింగ్) ను ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ అందిస్తుంది.

ఇప్పటివరకు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎమ్మెల్యే వరద రాజులు రెడ్డి,ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి వంటి ప్రజాప్రతినిధులు మరియు దాతల నుంచి వసతి, భోజనం తదితర మౌలిక సదుపాయాలకు మద్దతు లభించింది.

ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని భారతదేశ ప్రఖ్యాత దాత సీబీర్ ప్రసాద్ స్వీకరించి మరింత విస్తరించారు. ఆయన సహకారంతో:

వినుకొండలో పురుషులకు

విజయవాడలో స్త్రీలకు

ఉచిత వసతి, భోజనం మరియు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించబడతాయి. ఈ విధంగా మొత్తం 200 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విద్యా బోధన పూర్తిగా డా. లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారానే నిర్వహించబడుతుంది.

దరఖాస్తు విధానం

వాట్సాప్ నంబర్ 78420 54669





# కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ భవనాలను ఉపయోగించండి...

### -లంకిశెట్టి బాలాజీ డిమాండ్...

మచిలీపట్నం (పెన్ పవర్)ఫిబ్రవరి 07:

జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నంలో కేవలం అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వానికి చెందిన కోట్లాది రూపాయల ఖరీదు చేసే భవనాలు మూతబడి ఉన్నాయి అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. శనివారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ మచిలీపట్నం మెయిన్ రోడ్డు 17వ డివిజన్ లోని కోట్ల రూపాయలు ఖరీదు చేసే "టౌన్ హాల్" మూతపడి పది సంవత్సరాలు గడుస్తున్నా దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. గతంలో కొన్ని వేల కార్యక్రమాలు నిర్వహించిన టౌన్ హాలు నేడు మూత పడటం సాంస్కృతిక సాహిత్య సంస్థలకు తీరనిలోటని బాలాజీ అన్నారు. నగరం నడిబడ్డలో సువిశా లమైన కార్ పార్కింగ్ తో ఉన్న టౌన్ హాల్ బిల్డింగును మూసివేయడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. కేవలం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పూర్తి నిర్లక్ష్యం వల్ల పవన్ మూసివేశారని బాలాజీ అన్నారు. అదేవిధంగా గత 15 సంవత్సరాలుగా నిర్లక్ష్యం కాబడిన మచిలీపట్నం టి.టి.డి కళ్యాణ మండపం కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రిపేర్లు చేసి ఆధునికరించాలని బాలాజీ డిమాండ్ చేశారు. టీటీడీ కల్యాణ మండపం మూసి వేయడం వలన హిందూ బత్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని బాలాజీ అన్నారు కోట్ల రూపాయలు ఆదాయం ఉన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపాలు పనిచేయకపోవడం అధికారులకు కనిపించడం లేదా అని బాలాజీ ప్రశ్నించారు. మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ సాయిబాబా గుడి వెనక ఉన్న అంబేద్కర్ భవన్ కు తక్షణమే నిధులు విడుదల చేసి అంబేద్కర్ భవనం ఆధునిక వసతులు తో నిర్మించాలని బాలాజీ డిమాండ్ చేశారు. నగర ప్రజలకు అందుబాటులో ఉండే టౌన్ హాలు, టిటిడి కళ్యాణ మండపం, అంబేద్కర్ భవన్ నేడు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రవేటు కళ్యాణ మండపాలు లక్షల రూపాయలలో అద్దెలు వసూలు చేసి దోపిడీకి గురి చేస్తున్నాయని బాలాజీ అన్నారు. జిల్లా ముఖ్య కేంద్రంలో విలువైన మూడు భవనాలను వెంటనే వినియోగం తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాలాజీని కోరారు

# బంగారు వజ్రాభరణాల అమ్మకాలు విషయంలో నాణ్యతకు కేరాఫ్ అడ్రస్ వసుంధర జ్యువెలరీ..





బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07,

వసుంధర జ్యువెలరీ ఆధ్వర్యంలో గుంటూరులో ఏర్పాటు చేసిన బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనకు అనూహ్య స్పందన లభించింది. బృందావన్ గార్డెన్స్ క్యాపిటల్ హోటల్ లో నిర్వహించిన ఎగ్జిబిషన్ ను పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సతీమణి మాధవి, వసుంధర జ్యువెలరీ షోరూం ప్రతినిధులు వసుంధర, మేఘన తదితరులు పాల్గొన్నారు. బంగారు వజ్రాభరణాల అమ్మకాలు విషయంలో నాణ్యతకు కేరాఫ్ అడ్రస్ గా వసుంధర జ్యువెలరీ ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి తెలిపారు. లేటెస్ట్ డిజైన్ లతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను గుంటూరు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుంటూరులో 2 రోజుల పాటు బంగారు వజ్రాభరణాల ప్రదర్శన ఉంటుందని వసుంధర, మేఘన తెలిపారు. ప్రత్యేకంగా పెళ్లిళ్ల సీజన్ ను దృష్టిలో ఉంచుకొని అన్ని వయసుల వారికి నచ్చే ఆభరణాలు అందుబాటులో ఉంచామని తెలిపారు.


# అద్భుతమైన నిర్మాణాలు.. శిల్పకళ, చిత్రకళ, జలకళకు ప్రతీక కొండవీడు

**కొండవీడు ఉత్సవాల తొలిరోజు వేడుకలను లాంఛనంగా ప్రారంభించిన కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, ఎంపీలావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి**

**ఉత్సవాల తొలిరోజు సాయంత్రం ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నరసరావు పేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, జీడీసీసీ ఛైర్మన్ మక్కెన మల్లిఖార్జున రావు**

**కోటపై ఏర్పాటు చేసిన వినోద, సాహస, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించి, అధికారులను పేరుపేరునా అభినందించిన ప్రజాప్రతినిధులు**

**కొండవీడు అభివృద్ధికి రూ.100 కోట్లు అయినా ఇవ్వడానికి సిద్ధమన్న పారిశ్రామికవేత్త నడికట్టు రామిరెడ్డి ఉదారతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా: ప్రత్తిపాటి**





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 07:
కొండవీడు : రెడ్డిరాజుల ఏలుబడిలో ఆనాడే తెలుగు సాహిత్యం, చిత్రకళ, శిల్పకళ, యుద్ధ నైపుణ్యాలకు, శత్రు రక్షణకు ప్రధాన స్థావరంగా కొండవీడు కోట నిలిచిందని, ఇక్కడ చేసేది సామాన్య ట్రెక్కింగ్ కాదని, మన చరిత్రతో సంభాషిస్తూ, మన పూర్వీకులతో కలిసి అడుగులు వేయడం అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

కొండవీడు ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆయన అతిథులు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, స్థానిక శాసనసభ్యులు, మాజీమంత్రి ప్రత్తిపాటితో కలిసి కొండవీడు ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఉత్సవాలకు విచ్చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటికి అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేదికపై నుంచి వారు ప్రసంగించారు.

**తెలివైన ప్రణాళికలు, దూరదృష్టి నిర్మాణాలకు ప్రతీకలు కొండవీడు నిర్మాణాలు : కేంద్రమంత్రి పెమ్మసాని**

కొండవీడు వైభవానికి ఎంతో విశిష్టత ఉందని, తెలివైన ప్రణాళికతతో దూరదృష్టితో ఇక్కడి నిర్మాణాలున్నాయని పెమ్మసాని ప్రశంసించారు. శత్రు రక్షణతో పాటు, జలసంరక్షణ చర్యలకు కొండవీడు కేంద్రంగా నిలవడం నిజంగా గర్వించాల్సిన అంశమన్నారు. కొండపైన ఎప్పుడూ నీరు ఉండేలా మూడు చెరువుల నిర్మించడం సామాన్య విషయం కాదన్నారు. సాంస్కృతిక వైభవంతో పాటు, ప్రకృతితో మమేకమయ్యేలా కోట నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇటువంటి ఘన చరిత్రను భావి తరాలకు తెలియచేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుల కృషి అభినందనీయమని పెమ్మసాని అభిప్రాయపడ్డారు. గతంలో 2014-19లో కొండవీడు ఘాట్ రోడ్డు నిర్మించారని, దానివల్లే పర్యాటకుల తాకిడి పెరిగిందన్నారు. కులాల కంపుతో మగ్గిపోతున్న సమాజ రక్షణే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆయన అన్ని మతాలు, కులాల ఆచారాలు, సాంప్రదాలు, సంస్కృతిని అమితంగా గౌరవిస్తారని పెమ్మసాని తెలిపారు. మన సంస్కృతిని గౌరవించాలన్న ప్రత్తిపాటి సూచన మేరకే ఉత్సవాలకు రావడం జరిగిందన్నారు. కోట నిర్మాణంలోని రాళ్లు మాట్లాడినంతకాలం కొండవీడు చరిత్ర శాశ్వతంగా నిలుస్తుందని, ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. గోల్కొండ హోటల్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి కొండవీడు అభివృద్ధికి ముందుకు వచ్చినందుకు ఈ ప్రాంత ప్రజల తరుపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నట్టు పెమ్మసాని పేర్కొన్నారు.

**అద్భుత జల నిర్మాణాల సౌధం కొండవీడు : మంత్రి ఆనం**

రాష్ట్రంలో ఇప్పుడు జరిగే జలాశయాల అభివృద్ధి మనం చూస్తున్నామని, కానీ మన పూర్వీకులు, కొండపైన ఏడాది పొడవునా జలకళ ఉండేలా చెరువులు నిర్మించడం ఆషామాషీ విషయం కాదని దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు, సర్ అర్థర్ కాటన్ వంటి మేథావులు లేని రోజుల్లో ఇంతటి అద్భుత జల నిర్మాణాలు చేయడం నిజంగా గర్వించాల్సిన అంశమన్నారు. ఇంతటి గొప్ప నిర్మాణ శైలి, విశిష్టతల కలయికైన కొండవీడు వైభవం కచ్చితంగా భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆనం స్పష్టం చేశారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని, ఇంతటి గొప్ప ఆలోచనను కార్యరూపం దాల్చేలా కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు, కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నట్టు ఆనం తెలిపారు.

**కొండవీడు వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియచేయాలి : ఎంపీ లావు**

ఇటీవలే ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆధ్వర్యంలో భారీఎత్తున లక్షలాది సమక్షంలో ఎడ్లపందేలు నిర్వహించారని, అవి ప్రజలకు వినోదాన్న అందిస్తే..నేడు నిర్వహిస్తున్న కొండవీడు ఉత్సవాలు మన చారిత్రక వైభవాన్ని నేటియువతకు తెలియచేసే గొప్ప కార్యక్రమమని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.

**కొండవీడు కోటపై జంతుప్రదర్శన శాల ఏర్పాటు చేయాలని నిర్ణయించాం**

కొండవీడు చరిత్ర, మాచర్ల పల్నాటి యుద్ధచరిత్ర, నాగార్జున కొండపైనున్న నిర్మాణాలు మన జిల్లా పూర్వ చరిత్రను, చారిత్రక వైభవాన్ని జిల్లా విద్యార్థులు, యువత తప్పనిసరిగా తెలుసుకోవాలని ఎంపీ లావు సూచించారు. ఉత్సవాల్లోని సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు అనుభూతి చెందడంతో పాటు.. కొండవీడు వైభవం గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. విద్యాసంస్థల అధ్యాపకులు కొండవీడు వైభవాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కొండవీడు ఘాట్ రోడ్డు అంతటి రోడ్డు ఈ ఆరేడు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఎక్కడా వేసిన దాఖలాలు లేవన్నారు. అటవీప్రాంతంలో ఉన్న కొండవీడు కోటపై ఒక జంతు ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దానిపై కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతాం.ఎకో టూరిజం కేంద్రంగా కొండవీడును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఎప్పటినుంచో అనుకుంటున్నారని ఎంపీ లావు తెలిపారు.

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కొండవీడుకు పూర్వవైభవం తీసుకొస్తాం : ప్రత్తిపాటి**

కొండవీడు కోట రెడ్డిరాజులు, శ్రీకృష్ణదేవరాయలు, కాకతీయులు, ముస్లిం చక్రవర్తుల పాలనా వైభవానికి ప్రతీకగా నిలిచిన గొప్ప చారిత్ర కేంద్రమని, ఇంతటి ఘనచరిత్ర కలిగిన ప్రాంతం గనుకే అన్ని విధాల అభివృద్ధి చేయాలని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన చేశారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలియచేశారు. 2014-19 మధ్య చంద్రబాబు రూ.40 కోట్లతో కొండపైకి అద్భుతమైన ఘాట్ రోడ్డు వేయించారని, తర్వాత కొండపైన అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించారని ప్రత్తిపాటి తెలిపారు. తర్వాత ప్రభుత్వం మారడంతో కోట అభివృద్ధి పడకేసిందన్నారు. ఎంపీ లావు సహకారంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూతతో కొండవీడుకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రత్తిపాటి ఈ సందర్భంగా తెలియచేశారు. పారిశ్రామికవేత్త నడికట్టు రామిరెడ్డి కొండవీడు అభివృద్ధికి రూ.100 కోట్లైనా ఇవ్వడానికి సిద్ధమని చెప్పడం నిజంగా చాలా గొప్ప విషయమని, ఆయన ఉదారతను ఎంత పొగిడినా తక్కువే అవుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

**కొండవీడు కోటపై ఉన్న ప్రతి నిర్మాణం చరిత్రకు ఆనవాలే**

కోటపై ఉన్న విగ్రహాలు, శాసనాలు, రాతి కట్టడాలు, ప్రత నిర్మాణం గత చరిత్రకు ఆనవాళ్లని, ఇలాంటి ప్రదేశాన్ని అమరావతి రాజధాని సమీపంలోనే గొప్ప పర్యాటక, చారిత్రక ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నది చంద్రబాబు ప్రధాన ఆశయమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. భవిష్యత్ లో కొండవీడును డెస్టినేషన్ మ్యారేజ్ కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు ఉత్సవాలను ఇంతభారీ స్థాయిలో ఏర్పాటుచేసిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీవో మధులత, డీఎఫ్.ఓ మధులత సహా అధికారులందరికీ పేరుపేరునా ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు.

శనివారం ఉదయం జరిగిన ఉత్సవాలకు ప్రత్యేక అతిథులుగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు హాజరవ్వగా, సాయంత్రం ప్రత్యేక అతిథులుగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నరసరావు పేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, జీడీసీసీ ఛైర్మన్ మక్కెన మల్లిఖార్జున రావులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జగన్ వన్నీ కుట్ర రాజకీయాలు... ఎమ్మెల్యే నసీర్...

పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 07,
అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు దగ్గరకు రాకుండా పరదాల చాటున దాక్కున్న జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ విమర్శించారు. మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నసీర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కులం చూడం, మతం చూడమని చెబుతూనే కుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దొంగలు, హంతకుల కోసం ఓదార్పు యాత్రలు చేస్తూ ప్రజల నుంచి మరింత వ్యతిరేకత మూటగట్టుకుంటున్నారని పేర్కొన్నారు. జగన్ చేస్తోన్న రాజకీయ యాత్రలతో వైసీపీకి చెందిన ఇద్దరు మృతికి కారణమయ్యారని, మంచి భవిష్యత్తు ఉన్న ఇలాంటి వారిని పొట్టనబెట్టుకున్నారని మండిపడ్డారు. మృతి చెందిన వారికి కూటమి ప్రభుత్వం తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని చెప్పారు. వైసీపీకి చెందిన టీమ్ 11 మాత్రం ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీ గడప తొక్కకపోవడమేమిటని ప్రశ్నించారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు రావడానికి 32 కిలోమీటర్ల దూరాన్ని ఏడు గంటలు చేశారంటే జగన్ ను ఏమనాలని ప్రశ్నించారు. హంతకుడైన పిన్నెల్లి కోసం, డ్రగ్స్ దందా నడుపుతున్న కొండా రెడ్డి కోసం, నకిలీ మద్యం కేసులో ముద్దాయిల కోసం, దళితులను కిడ్నాప్ చేసి కిరాతకంగా హత్యగావించిన కిరాయి గూండాల కోసం జగన్ యాత్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాప్తాడులో హెలికాప్టర్ డ్రామా, ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులు, తెనాలిలో గంజాయి బ్యాచ్ పరామర్శల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధిని ఓర్వలేక ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని చెప్పారు.

అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు దగ్గరకు రాకుండా పరదాల చాటున దాక్కున్న జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ విమర్శించారు. మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నసీర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కులం చూడం, మతం చూడమని చెబుతూనే కుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దొంగలు, హంతకుల కోసం ఓదార్పు యాత్రలు చేస్తూ ప్రజల నుంచి మరింత వ్యతిరేకత మూటగట్టుకుంటున్నారని పేర్కొన్నారు. జగన్ చేస్తోన్న రాజకీయ యాత్రలతో వైసీపీకి చెందిన ఇద్దరు మృతికి కారణమయ్యారని, మంచి భవిష్యత్తు ఉన్న ఇలాంటి వారిని పొట్టనబెట్టుకున్నారని మండిపడ్డారు. మృతి చెందిన వారికి కూటమి ప్రభుత్వం తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని చెప్పారు. వైసీపీకి చెందిన టీమ్ 11 మాత్రం ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ అసెంబ్లీ గడప తొక్కకపోవడమేమిటని ప్రశ్నించారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు రావడానికి 32 కిలోమీటర్ల దూరాన్ని ఏడు గంటలు చేశారంటే జగన్ ను ఏమనాలని ప్రశ్నించారు. హంతకుడైన పిన్నెల్లి కోసం, డ్రగ్స్ దందా నడుపుతున్న కొండా రెడ్డి కోసం, నకిలీ మద్యం కేసులో ముద్దాయిల కోసం, దళితులను కిడ్నాప్ చేసి కిరాతకంగా హత్యగావించిన కిరాయి గూండాల కోసం జగన్ యాత్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాప్తాడులో హెలికాప్టర్ డ్రామా, ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులు, తెనాలిలో గంజాయి బ్యాచ్ పరామర్శల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధిని ఓర్వలేక ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని చెప్పారు



# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని ప్రచారం అధికారులకు సమ్మె నోటీసులు అందజేత

రేపల్లె పెన్ పవర్,
లేబర్ కోడ్స్ రద్దుచేయాలని,కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని ఈనెల 12 సమ్మెలో పాల్గొనాలని ప్రచారం,సమ్మె నోటీసులు..మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె నోటీసు,రైస్ మిల్లు కార్మికులో విస్తృత ప్రచారం... రేపల్లె మున్సిపల్ ఇంజనీరింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గా మున్సిపల్ కమిషనర్ కే. సాంబశివరావు కి సమ్మె నోటీస్ అందజేయడం జరిగింది,మరియు రైస్ మిల్ ముఠా వర్కర్స్ లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్ ను రద్దుచేయాలని ఈనెల 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు,ప్రమాదకర లేబర్ కోడ్స్ అమలువల్ల సమ్మె హక్కు,యూనియన్ రిజిస్ట్రేషన్ హక్కు,8గంలు పని కోల్పోయి 12గంటలకి పని గంటలు పెంపు,కార్మికుడు పర్మినెంట్ కాకుండా ఎప్పటికీ ఒప్పంద కార్మికుడుగానే మిగిలిపోయిన ప్రమాదం వల్ల ఉద్యోగభద్రత ఉండదు,మహిళలుతో రాత్రిపూట పనిచేయించటం,పిఎఫ్ లో 2 శాతం వాటా కార్మికుల మీద అదనంగా పడే ప్రమాదం ఉంది,రోజుకి



178రూ కూలి చాలు అన్నట్లు లేబర్ కోడ్స్ లో ఉంది అంటే నెలకు 5340/- వేతనం కావున ఇంతటి ప్రమాదభరితమైన లేబర్ కోడ్స్ రద్దు అయ్యేవరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేసే కార్మికవర్గం అసంఘటిత రంగంలో పనిచేసే రైస్ మిల్ ముఠా కార్మికవర్గం అందరూ పోరాటాలలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు

.ఈ ప్రచార కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి.ప్రభాకరరావు,కార్యదర్శి ఎన్.రవిబాబు,కోశాధికారి రాఘవ, విద్యుత్ రంగం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నాయకులు బి.సురేష్, రైస్ మిల్ ముఠావర్కర్ సీనియర్ నాయకులు యు.రామకృష్ణ,వి.సుబ్బారావు,కే. మాణిక్యరావు,ఎన్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పత్తికొండలో ఉత్సాహంగా ప్రారంభమైన ‘ఓపెన్ టు ఆల్‘ వాలీబాల్ టోర్నమెంట్

## -ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ కుమార్....

పత్తికొండ పెన్ పవర్,
పత్తికొండ :పత్తికొండ పట్టణంలో క్రీడా ఉత్సాహం ఉరకలెత్తుతోంది. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ‘రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్-2026’ ప్రారంభోత్సవానికి విచ్చేసిన పత్తికొండ నియోజకవర్గ శాసనసభ్యులు కే.ఈ. శ్యామ్ కుమార్ గారికి శనివారం నాడు ఉదయం ఆయన 15వ వార్డుకు చేరుకోగా, స్థానిక నాయకులు మరియు టోర్నీ అన్నదాత పల్లె పవన్ కుమార్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యకర్తల కోలాహలం మధ్య ఎమ్మెల్యేను అభిమానులు సొసైటీ బ్యాంక్ గ్రౌండ్‌కు సాదరంగా ఆహ్వానించారు.
స్థానిక సొసైటీ బ్యాంక్ గ్రౌండ్ లో అట్టహాసంగా ప్రారంభమైంది. పత్తికొండ నియోజకవర్గ శాసనసభ్యులు కే.ఈ. శ్యామ్ కుమార్ రిబ్బన్ కట్ చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, యువతలో శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణను మరియు ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇంతటి భారీ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా



అభినందించారు.
‘ఓపెన్ టు ఆల్’ విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి జట్లు తరలివచ్చాయి. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో క్రీడాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు. ఫిబ్రవరి 07 నుండి 09 వరకు మూడు రోజుల పాటు ఈ సంబరం కొనసాగనుంది.
విజేతలకు ప్రోత్సాహకంగా పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ ప్రథమ బహుమతిగా రూ. 50,000/- ప్రకటించగా, ద్వితీయ బహుమతిని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి (రూ. 30,000/-), తృతీయ బహుమతిని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్ (రూ. 20,000/-), మరియు నాల్గవ బహుమతిని ముత్తుకూరు గోవిందు (రూ. 10,000/-) స్పాన్సర్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్నదాతగా పల్లె పవన్, జెర్సీ స్పాన్సర్‌గా చింతకాయల శ్రీకాంత్, షీల్డ్స్ స్పాన్సర్‌గా చెక్క గోపాల్ వ్యవహరిస్తుండగా, నియోజకవర్గ ముఖ్య నాయకులు, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# సంత జూటూరులో జర్నలిస్ట్ పై టిడిపి నాయకుడు దాడి

## -ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు చెప్పే నిజాలను మీడియాలో ప్రచురిస్తే దాడులా..!

నంద్యాల జిల్లా పెన్ పవర్, ఫిబ్రవరి 7 : శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం సంత జుటూరు గ్రామంలో జర్నలిస్ట్ పై శనివారం టిడిపి నాయకుడు దాడి చేశాడని బాధితుడు వాపోయారు. సంత జూటూరు గ్రామం సొసైటీలో యూరియా రైతులకు అందడం లేదని, యూరియా పంపిణీ పై అవకతవకలు జరిగాయని, యూరియా సకాలంలో దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం జర్నలిస్ట్ మీడియాలో ప్రచురించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీడియాలో ప్రచురిస్తావా..! అని దుష్పశలాడుతూ శనివారం సహకార సొసైటీ బ్యాంకు దగ్గర దాడి చేసినట్లు బాధితుడు ఆంజనేయులు తెలిపారు. వారు మాట్లాడుతూ.. అధికారులు విచారణకు వస్తున్నారని శనివారం సహకార సొసైటీ బ్యాంక్ దగ్గరకు రావాలని పిలిపించడం జరిగిందని తెలిపారు. అక్కడ సొసైటీ సభ్యులతో, సిబ్బందితో మాట్లాడుతుండగా టిడిపి మండల కన్వీనర్ ముమ్మడి. నాగ కృష్ణారెడ్డి ప్రభుత్వంకు వ్యతిరేకంగా న్యూస్ రాస్తావా అని చెప్పలేని విధంగా దుష్ప్రసలాడుతూ దాడి చేసినట్లు తెలిపారు. ఒక కన్నుకు గాయం కావడంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయడానికి వెళ్ళగా ఎస్ఐ ఫిర్యాదు తీసుకోలేదని ఆరోపించారు. దాడి చేసిన టిడిపి నాయకుడు పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కోరారు. జర్నలిస్ట్ పై దాడిని వ్యతిరేకిస్తూ .. పలు జర్నలిస్ట్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ పై దాడి చేయడం సిగ్గుచేటని.. ఇలాంటివి పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు








# 15వ తేదీన అరవపల్లి బాల కోటేశ్వర స్వామి మహాశివరాత్రి తిరుణాల ఏర్పాట్లపై తాసిల్దార్ సమీక్ష సమావేశం

బాపట్ల జిల్లా రేపల్లె పెన్ పవర్, ....2.26
ఈనెల 15వ తేదీన జరగనున్న రేపల్లి మండలం ఆరవపల్లి శ్రీ బాల కోటేశ్వర స్వామి మహాశివరాత్రి తిరునాళ్ల కు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రేపల్లె మండల తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు అన్నారు.. బుధవారం నాడు
తహసీల్దార్ రేపల్లె వారి అధ్యక్షతన శివరాత్రి పర్వదిన సందర్భంగాఅరవపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగు తిరునాళ్లపైన వివిధ శాఖల వారితో సమీక్ష సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తెలియజేసి ఉన్నారు అదేవిధంగా గత సంవత్సరం కంటే కూడా ఈ సంవత్సరం ఇంకా మెరుగ్గా ఏర్పాట్లు చేసి భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తాసిల్దార్ వారు ఆదేశించి, ఉన్నారు.. ఈ సమావేశంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి దీవి వెంకట అప్పలాచార్యులు దేవస్థానం పాలకమండలి సభ్యులు గ్రామ సర్పంచ్ లోయ బాబు నాంచారయ్య రేపల్లె పట్టణ ఎస్సై రాజశేఖర్ ఎక్సైజ్ అగ్నిమాపక శాఖ జల వనరుల శాఖ ఆర్ అండ్ బి ఆర్ టి సి ఇరిగేషన్ పంచాయతీరాజ్ అధికారులతో పాటు ఎంపీడీవో సిహెచ్ రవిబాబు గ్రామ కార్యదర్శి భాషా ఆర్ ఐ ఇంచార్జ్ పి రాంబాబు విద్యుత్ శాఖ ఆర్టీసీ దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సిపి పార్టీపై వరుస దాడులను ఖండించిన రేపల్లె నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ డాక్టర్ గణేష్

రేపల్లె పెన్ పవర్, ..7..2 26
వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు పై దాడుల ను రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ ఇంచార్జ్ ఈ పూరి గణేష్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసిపి పార్టీ నాయకులు ఇళ్లపై ఆస్తులపై దాడులు చేయటం దుర్మార్గమని, డాక్టర్ ఈ పూరి గణేష్ అన్నారు . రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇంటిపై దాడులు చేయటం కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనం ప్రజాస్వామ్యంలో ఎలాంటి మంచిది కాదు అని ఆయన అన్నారు



# రౌతు లక్ష్మీపురం గ్రామ ప్రజలు మరియు ఆలయ నిర్వాహకులు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఎంజిఆర్



పాతపట్నం పెన్ పవర్, ఫిబ్రవరి 07
పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం మండలం రౌతులక్ష్మీపురం గ్రామంలో సీతారామాలయం అభివృద్ధికి,ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు కలిసి వినతిపత్రం సమర్పించారు.గ్రామ ప్రజల ఆకాంక్షలను ఎమ్మెల్యే , వెంటనే స్పందించి టీటీడీ దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా 15 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు.ఈ నిధులతో భజన మండప నిర్మాణం చేపట్టనుండటంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెరుగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు శాసనసభ్యులు మామిడి గోవిందరావు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి, అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్న ఎమ్మెల్యే నాయకత్వం ఆదర్శప్రాయమని వారు కొనియాడారు

# విద్యాంజలి 2.0 కార్యక్రమంలో భాగంగాద ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు

కోడుమూరు పెన్ పవర్, ఫిబ్రవరి 7.
సి.బెలగల్ మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సి. బెలగల్ యందు కె.యెస్. ఆదమ్ బాషా ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందరికీ ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉదయం 9.00 నుండి సాయంత్రం 4.00 వరకు రిసోర్స్ పర్సన్స్ గా శ్రీ శుభానంద రావు గారు, శ్రీమతి నసీమా గారు విద్యాంజలి 2.0 యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు.పాఠశాల అవసరాలు, నిధుల సమీకరణ, దాతల నుండి విరాళాలు, ప్రవాస భారతీయుల నుండి విరాళాలు, కార్పొరేట్ సంస్థల నుండి విరాళాలు సేకరించుట మరియు స్వచ్ఛంద సంస్థల నుండి విరాళాలు సేకరించుట గురించి వివరంగా చర్చించడమైనది. విద్యాంజలి 2.0 పథకం ద్వారా ఉద్యోగాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియమకాలుఉండవని మధ్యలో ఉన్న దళారీలు చెప్పిన మాటవిని మోసపోవద్దనియు, తప్పుడు నియామక పత్రాలు తెస్తే పై అధికారుల అనుమతి లేకుండా ఎవరినీ చేర్చుకోకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలం లోని ప్రధానోపాధ్యాయులు, సి ఆర్ ఎం టిలు పాల్గొన్నారు

# హిందు ధర్మాన్ని భూజాన ఎత్తుకున్న టీడీపీ

**కర్నూలు ఫిబ్రవరి 8, పెన్ పవర్ :** భారతీయ జనతా పార్టీతో సుదీర్ఘకాలం ప్రయాణిస్తూ వస్తోంది తెలుగుదేశం పార్టీ. అయితే ఎన్నడూ హిందుత్వ వాదాన్ని తెలుగుదేశం పార్టీ తెర ముందుకు తేలేదు. చంద్రబాబు సైతం ఎన్నడు మాట్లాడిన దాఖలాలు లేవు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా హిందుత్వవాదంపై మొగ్గు చూపలేదు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లో పడేయడానికి హిందూ ధర్మాన్ని భుజానికి ఎత్తుకున్నారు చంద్రబాబు. ఇది చంద్రబాబులో స్పష్టమైన మార్పు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు తిరుమల ఏడుకొండల వాడి ప్రతిష్టను తగ్గించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని కొత్త నినాదాన్ని అందుకున్నారు చంద్రబాబు. ఏపీలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా తిరుమల వెంకటేశ్వర స్వామికి కోట్లాదిమంది భక్తులు ఉన్నారు. ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత ఇబ్బంది కలిగించే విషయమే.అయితే ఏపీలో కూటమి ఐక్యత లేకుండా పోతేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం దక్కుతుందని విజయసాయి రెడ్డి లాంటి వారు కూడా వ్యాఖ్యానించారు. కానీ ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అటాక్ చేయడం ప్రారంభించిందో.. ఆ మూడు పార్టీల మధ్య బంధం మరింతగా పెరిగింది. ఈ రెండేళ్లలో తొలిసారి కూటమి నేతలు ఒకే వేదిక పైకి వచ్చారు. తిరుమల లడ్డు వివాదాన్ని తెరపైకి తీసుకురావడం తమకు కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. కూటమి ఐక్యత ఒకవైపు.. హిందుత్వవాదం ఇంకోవైపు.. గోవిందుడి పైనే కుట్రగా అభివర్ణించడం ద్వారా ఓటు బ్యాంకు ఏకీకరణ మరోవైపు అన్నది వ్యూహంగా కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించారు చంద్రబాబుఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ కు తొలి సీఎంగా కూడా ఆయన వ్యవహరించారు. ఇప్పుడు రెండోసారి కూడా ఆయనే బాధ్యతలు చేపట్టారు. మరోవైపు తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రతిపక్ష నేతగా, జాతీయస్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాల సారధిగా కూడా వ్యవహరించారు. కానీ ఏ రోజు కూడా ఆయన హిందుత్వ వాదాన్ని తెరపైకి తేలేదు. జగన్మోహన్ రెడ్డి అవినీతి, వివేకానంద రెడ్డి హత్య వంటి అంశాలను ఎక్కువగా ప్రస్తావించేవారు. కానీ ఇప్పుడు తిరుమల వెంకన్న ప్రస్తావన తీసుకురావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థమవుతుంది. చూడాలి మరి ఇది ఎంతవరకు వర్కౌట్ అవుతుందో..




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్ధశ

**అనంతపురం, ఫిబ్రవరి 8, పెన్ పవర్:** ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిర్కోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు. లిథియం చాలా అరుదుగా దొరికే నిక్షేపాలలో ఒకటి.. తాడిమర్రి, తురకవారిపల్లి, దాడితోట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారట. అనంతపురం జిల్లాతోపాటుగా కడప జిల్లాలో (పార్నపల్లె, లోపటనూతల) కూడా పరిశోధనలు చేయగా.. అక్కడ కూడా లిథియంను గుర్తించారట.ఈ లిథియంను ఎక్కువగా బ్యాటరీలలో వినియోగిస్తారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలతో పాటుగా డిజిటల్ కెమెరాలు, మొబైల్స్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ ఖనిజాల కోసం చేస్తున్నారు. ఏఎండీ, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశోధనలతో పాటుగా హెలికాప్టర్ సర్వే కూడా చేపట్టారు.కేంద్రం ఇటీవల రేర్ ఎర్త్ కారిడార్లకు సహకారం అందిస్తామని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. సముద్ర తీరంలో బీచ్‌శాండ్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అరుదైన ఖనిజాలు ఉన్నట్లు తేలింది. గతంలో విశాఖపట్నంతో పాటుగా తూర్పుగోదావరి జిల్లాల్లో పరిధిలో బాక్సైట్ నిల్వలు గుర్తించిన సంగతి తెలిసిందే. చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బంగారం ఖనిజాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. వాటితో పాటుగా పైన తెలిపిన ఖనిజాలను కూడా గుర్తించారు. వీటి తవ్వకాలకు ముందుకొచ్చేవారికి కేంద్రం నుంచి ప్రోత్సాహం అందిస్తారు.

## తిరుపతిలో స్పేస్ సిటీ

**తిరుపతి, ఫిబ్రవరి 8, పెన్ పవర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వద్ద 2800 ఎకరాలలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. అయితే స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడత ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మరో రెండు నెలల్లో తొలివిడతను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. తొలి విడతలో 570 ఎకరాలలో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. ఈ ప్రాజెక్టుతో తిరుపతి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెప్తున్నారు,.ఏపీలో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పేస్ సిటీ ప్రాజెక్టు తొలి విడతను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. తిరుపతిలో 2800 ఎకరాలలో స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. మరో రెండు నెలలలో ఈ ప్రాజెక్టు తొలి విడతను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రీసెర్చ్, శాటిలైట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ టెక్నాలజీ హబ్‌గా ఈ స్పేస్ సిటీని తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచిస్తున్నారు.తిరుపతి జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రాంతంలో ఈ మెగా స్పేస్ సిటీ ప్రాజెక్టు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. స్పేస్ సిటీ ప్రాజెక్టు మొదటి దశలో 570 ఎకరాలలో 140 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోర్ ఇండస్ట్రియల్ యాక్టివిటీస్ మొదలు పెడతారు. మిగతా భూమిని రెసిడెన్సియల్ జోన్లు, ఇన్‌స్ట్యూషనల్ క్యాంపస్, లాజిస్టిక్ పార్కులు, అంతర్గత రహదారుల అభివృద్ధి , హైస్పీడ్ ఇంటర్నెట్, కరెంట్, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగిస్తారు.మరోవైపు స్పేస్ సిటీలో ఉపగ్రహాల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్ యూనిట్లు, టెస్టింగ్,క్యాలిబరేషన్ ల్యాబులు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్లు వంటివి ఏర్పాటు చేయనున్నాయి. అలాగే స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ హబ్స్, డేటా అనలిటిక్స్, డిఫెన్స్ అప్లికేషన్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ వంటివి అందుబాటులో ఉండనున్నాయి. మరోవైపు స్పేస్ సిటీ నిర్మాణం కోసం ఈ ప్రాంతాన్ని కూడా వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. సమీపంలోనే సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట ఉండటం, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరలో ఉండటం, జాతీయ రహదారులు, పోర్టులకు సమీపంలో ఉండటం కూడా కలిసి వస్తోంది.ఈ స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజులలో స్పేస్ సిటీ ద్వారా 25 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను స్పేస్ రంగంలో రాబట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.స్పేస్ సిటీ ప్రాజెక్టు ద్వారా ఇంజనీర్లు, సైంటిస్టులు, టెక్నీషియన్లు, డేటా స్పెషలిస్టులు, మిగతా అనుబంధ రంగాల వారికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్తున్నారు. మరోవైపు స్పేస్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక సర్వేలు, పర్యావరణ అంచనాలు, స్థానికులతో చర్చలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలలో స్పేస్ సిటీ తొలివిడత ప్రారంభిస్తారని సమాచారం.

## కేడర్ లో కనిపించని జోష్

## దాడులు జరిగిన చోటే కనపిస్తారా

**విజయవాడ, గుంటూరు, ఫిబ్రవరి 8,పెన్ పవర్ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేవలం పరామర్శలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం పూర్తయింది. దీంతో పరామర్శలు ఆపేసి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. వైసీపీ గత ఎన్నికల్లో కేవలం పదకొండు నియోజకవర్గాల్లోనే గెలిచింది. మిగిలిన 164 నియోజకవర్గాల్లో పార్టీ ఆశించినంత మాత్రం బాగా లేదు. అక్కడ క్యాడర్ కు, నేతలకు మధ్య గ్యాప్ పెరిగింది. రెండేళ్లవుతున్నా నేతలు కొందరు కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటన చేయాలంటున్నారు. పాదయాత్ర సంగతి తర్వాత.. అది ఏడాదిన్నర తర్వాత కాని మొదలు కాదు. కానీ ఈలోపు పార్టీలోని క్యాడర్ ను, లీడర్ ను యాక్టివ్ చేయాలంటే ఖచ్చితంగా జిల్లాలకు వెళ్లి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయాలని నేతలు కోరుతున్నారు.ఇప్పటికీ రాయలసీమలోని ఒకటి రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పార్టీ యాక్టివ్ గా లేదు. జగన్ బయటకు వచ్చినప్పుడు మాత్రం కార్యకర్తలు అభిమానంతో వచ్చి జగన్ కు స్వాగతం చెబుతున్నారు. జగన్ ను చూసేందుకు పోటీ పడుతున్నారు. కానీ చాలా నియోజకవర్గాల్లో పరిస్థితి మాత్రం ఇంకా మెరుగుపడలేదన్నది చాలా మంది బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ పదవులను పూర్తిగా చేపట్టలేదు. బూత్ లెవెల్ కమిటీల నియామకం చాలా చోట్ల జరగకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. పాత నేతలే తిరిగి పోటీ చేస్తారన్న భావనతో కొత్త వారు నియోజకవర్గంలో నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు ముందుకు రావడం లేదని గట్టిగా పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.ద్వితీయ శ్రేణి నేతలు కొంత గట్టిగానే ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతలు మాత్రం అప్పుడే ఎందుకన్నట్లు కొంత ఇంకా ఆలోచనలో ఉన్నారు. జగన్ పాదయాత్ర సమయానికి బయటకు వచ్చి యాక్టివ్ అయితే బాగుంటుందని వారి వ్యాపారాలు, మిగిలిన వ్యక్తిగత వ్యవహారాల్లో మునిగిపోయారు. 175 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో గెలిచిన 151 మందిలో పది నుంచి పదిహేను మందికి మించి యాక్టివ్ గా లేరు. ఇది నిజం. పరామర్శ చేయవచ్చు. తప్పులేదు. కానీ అదే సమయంలో జగన్ జిల్లాలకు వచ్చి కార్యకర్తలతో ముఖాముఖి సమావేశాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది.

# కాపు కాస్తామంటున్న వైసీపీ సామాజిక లెక్కల్లో జగన్ టీమ్



**గుంటూరు, ఫిబ్రవరి 8 పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాజకీయ దారులను వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఆలోచనలు సాధారణ విశ్లేషణలకు భిన్నంగా ఉంటాయని, ఓటమి తర్వాత మరింత జాగ్రత్తగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారని అనుచరులు అంటున్నారు. రాజకీయాల్లో ఓడిన చోటే తిరిగి బలం పెంచుకోవడం ఒక సంప్రదాయం. జగన్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుని, పాత పద్ధతులకు బదులుగా కొత్త వ్యూహాలపై నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఓటమికి కారణమైన రాజకీయ, సామాజిక పరిణామాలను ఆయన లోతుగా అధ్యయనం చేస్తున్నారని ఇటీవల ఆయన ప్రసంగాలు సూచిస్తున్నాయి.ఈ వ్యూహాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు) పాత్ర కీలకంగా మారుతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మూడున్నర దశాబ్దాలు పట్టింది. వైఎస్సార్ అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేసినా, ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలవలేకపోవడం ఆయన రాజకీయ ప్రయాణాన్ని నెమ్మదింపజేసింది. అయితే వైసీపీ ఏర్పడ్డాక జగన్ ఆయనకు ప్రాధాన్యత ఇచ్చారు. 2022లో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, తాజాగా కాపులలో "టైగర్" అంటూ బిరుదు ఇచ్చి ముందుకు తెచ్చారు.జగన్ రాజకీయ లెక్కల్లో కాపు సామాజిక వర్గం ముఖ్యంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో వారి మద్దతు కీలకంగా నిలిచింది. అప్పట్లో ముద్రగడ పద్మనాభం (ఉద్యమం కూడా కలిసివచ్చి, గోదావరి జిల్లాలు ( వైసీపీకి బలంగా మారాయి. కానీ 2024 నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పవన్ కళ్యాణ్ రూపంలో కాపులకు బలమైన నాయకుడు రావడం, ఆయన చంద్రబాబు నాయుడు తో జట్టు కట్టడం వల్ల రాజకీయ సమీకరణలు తారుమారు అయ్యాయి. ఈ మార్పుతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది.ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు ఘటనను జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంబటి కుమార్తె మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమపై అధికార దుర్వినియోగం జరుగుతోందని ప్రశ్నించడం కాపు వర్గాల్లో చర్చకు దారి తీసింది. జనసేన మద్దతుతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ) తమపైనే బలప్రయోగం చేస్తుందా అనే సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇది నేరుగా రాజకీయ నేతలకు కాకపోయినా, కాపు సమాజంలో భావోద్వేగాలను రేకెత్తించడానికే అన్న విశ్లేషణ ఉంది.గుంటూరు జిల్లా లో జగన్ పర్యటన సమయంలో కాపు జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పందన కనిపించిందని అంటున్నారు. అంబటి రాంబాబు భవిష్యత్తులో తన సామాజిక వర్గాన్ని ఎంతవరకు పోలరైజ్ చేయగలుగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది. వంగవీటి రంగా అనుచరుడిగా గతంలో కాపునాడు కార్యక్రమాల్లో పనిచేసిన నేపథ్యం ఆయనకు ఉంది. ఇప్పుడు వైసీపీ ఆయనను ముందుకు తెస్తూ కొత్త గుర్తింపునివ్వాలని చూస్తోంది. అంబటి విడుదల తర్వాత ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. కూటమి వర్సెస్ అంబటి అంశం రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారంలో జగన్ వేసిన అడుగు వ్యూహాత్మకమా కాదా అన్నది రాజకీయ ఫలితాలే తేల్చాలి.

**అంబాసిడర్ స్థాయికి అంబటి**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రమోషన్ పొందాలన్నా.. పదవులు దక్కించుకోవాలని అనుకున్నా ప్రత్యర్థి పార్టీల నాయకుల మీద బూతులతో విరుచుకుపడాలి. ఆయా పార్టీల నేతల ఇళ్లపై కర్రలతో దాడులకు దిగాలి. లేకుంటే నిత్యం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడుగా ఉంటూ ఆయన నామస్మరణ చేయాలి. ఆయన అడుగులకు మడుగులు వత్తాలి. అప్పుడే వారికి పదవులు లభిస్తాయి. పిలిచి మరి పదవులు కట్టబెడతారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల హయాంలో జరిగింది కూడా అదే.ఏదైనా మంత్రి పదవి నిర్వర్తిస్తే వారి శాఖలో ప్రగతి చూస్తారు. కానీ వైసీపీ హయాంలో శాఖల ప్రగతి కంటే ప్రత్యర్థులపై బూతులతో విరుచుకుపడే మంత్రులే అధికం. కొడాలి నాని కి తొలి మూడేళ్లు పదవి ఇచ్చారు జగన్. చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడనిదే పొద్దు గడవదు అన్నట్టు ఉండేది కొడాలి నాని పరిస్థితి. ఆ స్థాయిలో జగన్మోహన్ రెడ్డిని మెప్పించారు కనుక కొడాలి నానికి మంత్రి పదవి దక్కింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. అంతెందుకు జోగి రమేష్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన చంద్రబాబు ఇంటి మీదకు కర్రలతో దాడికి తెగబడినందుకే జోగి రమేష్ కు ఏకంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా క్యాబినెట్ లో చోటు కల్పించారు జగన్మోహన్ రెడ్డి.సొంత సామాజిక వర్గాన్ని జగన్ కోసం కించపరిచారు పేర్ని నాని ఇక అంబటి రాంబాబు గురించి చెప్పనవసరం లేదు. అప్పటికీ ఇప్పటికీ ఆయన నోరు అదుపులోకి రావడం లేదు. పోసాని కృష్ణ మురళి అయితే పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన కుటుంబాన్ని నీచాతి నీచంగా దూషించారు. ఏకంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఇక రోజా గురించి చెప్పనవసరం లేదు. రోజా గురించి చెప్పనవసరం లేదు. బూతు సైగలతో,, చిల్లర మాటలతో ప్రత్యర్థులను రెచ్చగొట్టేవారు. రెచ్చిపోయేవారు. అందుకు ఆమె పర్యాటక శాఖ మంత్రి పదవి పొందారు. ఇలా జగన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ హద్దులు చెరిపేసి దిగజారి ప్రవర్తించిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కాయి. ఇప్పుడు అంబటి రాంబాబుకు ఏ స్థాయిలో ప్రమోషన్ దక్కుతుందో చూడాలి.

# అఫెన్స్ మూడ్ లోకి కల్తీ నెయ్యి,...

**విజయవాడ, ఫిబ్రవరి 8, పెన్ పవర్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా ప్రకంపనలు సృష్టిస్తున్న కల్తీ నెయ్యి వ్యవహారం, అనూహ్యంగా అధికార కూటమి పార్టీల మధ్య సరికొత్త ఐక్యతకు పునాది వేసింది. విపక్షాల విమర్శలు, సాంకేతిక అంశాల నడుమ కొంత డిఫెన్స్ ధోరణిలో ఉన్నట్లు కనిపించిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇప్పుడు ఎదురుదాడికి సిద్ధమయ్యాయి. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఆధ్యాత్మిక భావోద్వేగ అంశంగానే కాకుండా, రాజకీయ అస్తిత్వ పోరాటంగా మారింది. ఆరంభంలో ఈ విషయంలో కొంత తడబడినట్లు కనిపించిన అధికార కూటమి, ఇప్పుడు పూర్తిస్థాయి అప్రమత్తతతో విపక్షాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.కల్తీ నెయ్యి అంశంలో సిట్ విచారణ, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, సీబీఐ ప్రమేయం వంటి అంశాలను అస్త్రాలుగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్లు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి నిర్ణయించింది. కేవలం ప్రభుత్వపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా గట్టి సమాధానం ఇవ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించిన కూటమి నేతలు, గురువారం ఉమ్మడిగా మీడియా ముందుకు రావడం ఒక కీలక మలుపు.వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మూడు పార్టీల ప్రతినిధులతో కూడిన ఒక అంతర్గత సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన భాగం. క్షేత్రస్థాయిలో ప్రజలకు కల్తీ జరిగిన తీరును, గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియను వివరించాలని నిర్ణయించాయి. సిట్ విచారణలో వెల్లడవుతున్న కీలక అంశాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకురావాలని, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న నెగటివ్ ప్రచారాన్ని మూడు పార్టీల ఐటీ విభాగాలు సమన్వయంతో తిప్పికొట్టాలని తీర్మానించాయి.ఈ అంశంలో పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దీనికి బీజేపీ జాతీయ స్థాయి మద్దతు కూడా తోడవడంతో, కూటమి మధ్య సైద్ధాంతిక సారూప్యత మరింత పెరిగింది. చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ భావోద్వేగ సందేశం, బీజేపీ జాతీయ అండదండలు కలగలిసి వైసీపీని రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో పార్టీల మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు సహజం. కానీ, ఈ నెయ్యి కల్తీ వ్యవహారం ఆ గ్యాప్‌ను పూడ్చేందుకు ఉపయోగపడింది. విచారణ సంస్థల క్లీన్ చిట్ రాకముందే వైసీపీ హడావుడి చేస్తోందని, దీన్ని ఎదుర్కోవడంలో డైలమా వీడిపోయిందని స్పష్టమవుతోంది. ప్రభుత్వ గొంతు కంటే కూటమి గొంతు బలంగా వినిపిస్తేనే ఫలితం ఉంటుందని గుర్తించడం కూటమి పరిణతికి నిదర్శనం.మొత్తానికి, వైసీపీ విసిరిన సవాల్‌ను కూటమి పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఈ ఉమ్మడి పోరాటం కేవలం కల్తీ నెయ్యి అంశానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఇతర పాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా ఒక నమూనాగా మారే అవకాశం ఉంది. సమన్వయం మెరుగుపడడం వల్ల ఏపీ రాజకీయాల్లో కూటమి మరింత బలోపేతం కానుంది.ఢిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు దాదాపు 8,900 కిలోల లాక్టిక్ యాసిడ్, లబ్సాను కొనుగోలు చేసినట్లు ఆధారాలు దొరికాయి. పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ వంటి చౌకరకం నూనెలకు ఈ రసాయనాలను కలిపితే, అవి అచ్చం నెయ్యికి ఉండే రంగు, రుచి, వాసనను సంతరించుకుంటాయి. ల్యాబ్ పరీక్షల్లో కూడా ఇది నెయ్యి అని నమ్మించేలా చేసేందుకు బీటా–కెరోటిన్ , ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్ వంటి మిశ్రమాలను కూడా జోడించారు. దాదాపు 57.56 లక్షల కిలోల నూనెను ఇలా రసాయనాలతో కల్తీ చేసి తితిదేకు (తిరుమల తిరుపతి దేవస్థానం) నెయ్యి పేరుతో అంటగట్టారు ఆహార భద్రతా చట్టం ప్రకారం పాలు, నెయ్యి వంటి ఉత్పత్తుల్లో లబ్సా వాడటం పూర్తిగా నిషేధం. ఈ రసాయనం కలిసిన పదార్థాలను తీసుకుంటే జీర్ణాశయం దెబ్బతినడం, పేగులకు గాయాల వ్వడం, కాలేయ వ్యాధులు తలెత్తుతాయి.

# ఛీ.. తూ.. ఇదీ ఒక గెలుపేనా..

## పాకిస్తాన్ జట్టును పొట్టుపొట్టు తిడుతున్న ఫ్యాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** గెలిచినా తిడతారు.. ఓడినా తిడతారు.. ఆడినా తిడతారు.. ఆడకపోయినా తిడతారు.. పాకిస్తాన్ జట్టు దుస్తితి ఇలా ఉంది. టీ 20 వరల్డ్ కప్ ఫస్ట్ డే.. గ్రూప్ ఏలో ఉన్న పాక్ జట్టు.. ఫస్ట్ మ్యాచ్ గా నెదర్లాండ్స్ టీంపై ఆడింది. పాకిస్తాన్ గెలిచింది. గెలిస్తే సంబరాలు చేసుకోవాలి కదా.. మరి తిడతారు ఏంటీ అంటారు.. అక్కడికే వస్తున్నాం.. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 20 ఓవర్లలో 147 పరుగులు చేసింది. ఆ తర్వాత 148 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగింది పాకిస్తాన్. నెదర్లాండ్స్ జట్టు.. పిల్ల బచ్చా టీం.. క్రికెట్‌లో పిల్లకూన జట్టు.. పాకిస్తాన్ ఏమో పెద్ద పులి లెక్క ఫీలయ్యారు పాక్ ఫ్యాన్స్.. గ్రౌండ్‌లో సీన్ రివర్స్ అయ్యింది.. పాకిస్తాన్ జట్టు.. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి ఏకంగా 20 ఓవర్ల 3 బంతులు తీసుకుంది. అంటే జస్ట్ మూడు బంతులు మిగిలి ఉండగా.. టార్గెట్ ఛేజ్ చేసి గెలిచింది. ఇక్కడే పాకిస్తాన్ జనం.. పాక్ క్రికెట్ అభిమానులు రగిలిపోయారు..పిల్లకూన నెదర్లాండ్స్ .. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి 19 ఓవర్లు తీసుకోవటం ఏంటీ.. అంటే చచ్చీచెడీ.. కష్టపడి గెలవటం ఏంటీ... నెదర్లాండ్స్ బౌలర్లు అంతలా పాక్ జట్టును వణికించారా.. ఇలా అయితే మిగతా జట్లతో ఇంకేం ఆడతారు.. అంటూ తిట్టిపోస్తున్నారు పాకిస్తాన్ జనం.. ఫ్యాన్స్.. 2026లో పాకిస్తాన్ జట్టు బోణీ కొట్టింది. నెదర్లాండ్స్‌శ్రీపై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్.. నెదర్లాండ్స్ జట్టును 19.5 ఓవర్లలో 147 పరుగులకు కట్టడి చేసింది. నెదర్లాండ్స్ జట్టు ఏడు వికెట్లు నష్టపోయి పాక్ ముందు 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పాకిస్తాన్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 19.3 ఓవర్లకే 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

పాక్ బ్యాటర్లలో ఫర్హాన్ 47 పరుగులతో రాణించాడు. ఫహీమ్ అష్రఫ్ 29 (నాటౌట్), అయూబ్ 24, బాబర్ అజమ్ 15, సల్మాన్ అఘా 12, మహ్మద్ నవాజ్ 6, షాహిద్ అఫ్రీదీ 5 (నాటౌట్)గా నిలిచారు. నెదర్లాండ్స్ బ్యాటర్లలో స్కాట్ ఎడ్వర్డ్ 37, బాస్ డి లీడే 30, మైకేల్ లెవిట్ 24, ఆర్యన్ దత్ 13 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో సల్మాన్ మీర్జాకు 3 వికెట్లు, మహ్మద్ నవాజ్ 2, అబ్రార్ అహ్మద్ 2, అయూబ్ 2, అఫ్రీదీకి ఒక వికెట్ దక్కింది. నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్ 2, పాల్ వాన్ మికరెన్‌శ్రీకు 2, వాన్ బీక్, కైల్ క్లైన్, రోలోఫ్ వాన్ డెర్ మెర్వేకు తలో వికెట్ దక్కింది.

# టీ20 వరల్డ్ కప్: రాణించిన హెట్మెయర్... విండీస్ 20 ఓవర్లలో 182-5

**టీ20 వరల్డ్ కప్ లో వెస్టిండీస్ వర్సెస్ స్కాట్లాండ్**


**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న స్కాట్లాండ్**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసిన వెస్టిండీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా స్కాట్లాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు భారీ స్కోరు సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్ షిమ్రోన్ హెట్మెయర్ (64) హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఫలితంగా స్కాట్లాండ్ ముందు 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన స్కాట్లాండ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (35), షాయ్ హోప్ (19) ఓ మోస్తరు ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఆ తర్వాత షిమ్రోన్ హెట్మెయర్ స్కాట్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 36 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి రోవ్‌మన్ పావెల్ (24), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (26) కూడా వేగంగా ఆడి తమ వంతు సహకారం అందించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ కర్రీ అద్భుతంగా బౌలింగ్ చేసి, 4 ఓవర్లలో కేవలం 23 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సఫ్యాన్ షరీఫ్, మైఖేల్ లీస్క్, డేవిడ్‌సన్ తలో వికెట్ తీశారు. అనంతరం 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. తాజా సమాచారం అందేసరికి స్కాట్లాండ్ 2.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 19 పరుగులతో ఆడుతోంది. జేసన్ హోల్డర్ బౌలింగ్‌లో మైఖేల్ జోన్స్ (1) ఔటయ్యాడు.

# రంగంలోకి శ్రీలంక.. భారత్‌తో మ్యాచ్‌పై పునరాలోచనలో పాకిస్థాన్?






**భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్‌పై పునరాలోచించాలని పాక్‌ను కోరిన శ్రీలంక**

**మ్యాచ్ జరగకపోతే తీవ్ర ఆర్థిక నష్టాలు తప్పవన్న శ్రీలంక క్రికెట్ బోర్డు**

**శ్రీలంక అభ్యర్థనపై తమ ప్రభుత్వంతో మరోసారి సంప్రదిస్తామన్న పీసీబీ**

**సోమవారం నాటికి ఈ అంశంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలన్న నిర్ణయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పునరాలోచనలో పడింది. ఈ మ్యాచ్‌ను నిర్వహించకపోతే తీవ్రంగా నష్టపోతామని టోర్నీ సహ ఆతిథ్య దేశమైన శ్రీలంక విజ్ఞప్తి చేయడంతో... పీసీబీ ఈ అంశాన్ని మరోసారి తమ ప్రభుత్వంతో సంప్రదించాలని భావిస్తోంది. ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించొద్దని కోరుతూ శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) పీసీబీకి ఒక ఈమెయిల్ పంపింది. ఈ కీలక మ్యాచ్ రద్దయితే తమ బోర్డుకు గేట్ మనీ, హాస్పిటాలిటీ అమ్మకాల రూపంలో భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఎస్ఎల్‌సీ అధ్యక్షుడు షమ్మీ సిల్వా.. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీకి నేరుగా వివరించారు. అంతేకాకుండా ఇది శ్రీలంకలో టోర్నమెంట్ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీలంకతో పాకిస్థాన్‌కు ఉన్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా వారి అభ్యర్థనను తేలిగ్గా తీసుకోలేమని పీసీబీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో లేని మొహ్సిన్ నఖ్వీ, తిరిగి వచ్చాక ఈ విషయాన్ని పాక్ ప్రధాని దృష్టికి తీసుకెళతానని షమ్మీ సిల్వాకు హామీ ఇచ్చారు. శ్రీలంక విజ్ఞప్తిని పాకిస్థాన్ తిరస్కరించిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని, సోమవారం నాటికి దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి పాకిస్థాన్ జట్టు టీ20 వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, భారత్‌తో మ్యాచ్ ఆడకుండా నిబంధన విధించింది. దీంతో పీసీబీ ఈ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించింది. గతంలో పాకిస్థాన్ పర్యటనలో తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన ఆందోళనలు ఎదురైనప్పుడు, శ్రీలంక ప్రభుత్వం తమ జట్టును వెనక్కి పిలవకుండా టూర్‌ను పూర్తి చేసేలా ఆదేశించిందని, ఈ నేపథ్యంలో శ్రీలంక విజ్ఞప్తికి ప్రాధాన్యం ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు.

# సొంత సంపాదన : ఈ టాలీవుడ్ హీరోల ఆస్తి ఎన్ని కోట్లంటే?









పింక్ సాక్షి మాలిక్ సాఫ్ట్ గ్లామ్ మూమెంట్‌లో అందంగా ఉంది



నభా నటేష్ బ్లూ డ్రీమ్స్ మీకు నిద్రలేని రాత్రులను అందిస్తాయి

టాలీవుడ్ హీరోలు అంటే కేవలం వెండితెరపై మెరిసే నటులే కాదు, వారు పక్కా బిజినెస్ మైండ్ ఉన్న సంపన్న వ్యక్తులు కూడా. సినిమాల ద్వారా వచ్చే రెమ్యూనరేషన్‌తో పాటు రియల్ ఎస్టేట్, స్టూడియోలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరియు సొంత వ్యాపారాల ద్వారా వీరు భారీగా ఆర్జిస్తున్నారు. మన అభిమాన హీరోల సంపాదన ఏ స్థాయిలో ఉంది? బాక్సాఫీస్ వద్దే కాకుండా ఆస్తుల విషయంలోనూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి అభిమానికి ఉంటుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

**అగ్రస్థానంలో సీనియర్ స్టార్స్:**
టాలీవుడ్‌లో అత్యధిక ఆస్తులు కలిగిన హీరోల జాబితాలో కింగ్ నాగార్జున అగ్రస్థానంలో నిలుస్తారు. అన్నపూర్ణ స్టూడియోస్, కన్వెన్షన్ సెంటర్లు , ఇతర వ్యాపారాల ద్వారా ఆయన ఆస్తి సుమారు రూ. 800 నుండి 900 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక మెగాస్టార్ చిరంజీవి సుమారు రూ. 650 నుండి 700 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఏలుతున్న ఈ సీనియర్ హీరోలు కేవలం సినిమాల ద్వారానే కాకుండా, తెలివైన పెట్టుబడులతో తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. వారి వెనకే విక్టరీ వెంకటేష్ (రూ. 120-150 కోట్లు), నందమూరి బాలకృష్ణ (రూ. 100-120 కోట్లు) కూడా భారీ స్థిరాస్తులతో కొనసాగుతున్నారు.

**గ్లోబల్ స్టార్స్ మరియు యువ హీరోల జోరు:**
ప్రస్తుత తరం హీరోల్లో మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్ మరియు ప్రభాస్ పోటాపోటీగా ఉన్నారు. మహేష్ బాబు తన సినిమాలతో పాటు ఏఎంబీ సినిమాస్, పలు బ్రాండ్ యాడ్స్ ద్వారా రూ. 350 నుండి 400 కోట్ల ఆస్తిని కలిగి ఉన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రూ. 350-370 కోట్లు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రూ. 350 కోట్లు, మరియు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా దాదాపు రూ. 350 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నట్లు సమాచారం. ఈ హీరోలు ఒక్కో సినిమాకు తీసుకునే భారీ రెమ్యూనరేషన్ వారి ఆస్తుల పెరుగుదలకు ప్రధాన కారణం అవుతోంది.

**మాస్ హీరోల ఆర్థిక సామ్రాజ్యం:**
మాస్ హీరోలుగా పేరు తెచ్చుకున్న జూనియర్ ఎన్టీఆర్ మరియు పవన్ కళ్యాణ్ కూడా ఆర్థికంగా బలంగానే ఉన్నారు. తారక్ ఆస్తి విలువ సుమారు రూ. 250 నుండి 300 కోట్ల వరకు ఉండగా, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆస్తుల విలువ రూ. 200 నుండి 250 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. వీరు కేవలం నటులుగానే కాకుండా వివిధ సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉంటూనే, తమ సంపాదనను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. మొత్తానికి టాలీవుడ్ స్టార్స్ బాక్సాఫీస్ కలెక్షన్ల రేసులోనే కాదు, వ్యక్తిగత ఆస్తుల విషయంలో కూడా రికార్డులు సృష్టిస్తున్నారు.

ఈ గణాంకాలను చూస్తుంటే టాలీవుడ్ హీరోలు కేవలం నటనకే పరిమితం కాకుండా, ఒక పక్కా వ్యూహంతో తమ ఆర్థిక భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని అర్థమవుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com